క్లుప్తంగా

పాలతల చైర్మన్ పదవికి రాజీనామా



పొలతల చైర్మన్ పదవికి రాజీనామా చేసి పత్రాన్ని ఈఓకు అందచేస్తున్న నాగమల్లారెడ్డి

పెండ్లిమర్రి : పోలతల మల్లేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పదవికి బుధవారం అంబటి నాగమల్లారెడ్డి రాజీనామా చేశారు. రాజీనామాను అమోదించాలని రాజీనామా పత్రాన్ని ఆలయ ఈఓ శ్రీనువాసులుకు అందజేశారు. ఈవిషయాన్ని దేవాదాయశాఖ కమిషనర్ విజయవాడకు పంపుతామని ఆలయ ఈఓ తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



భాస్కర్

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలికి చెందిన ఉపాధిహామి పథకంలో ఫీల్డ్ అసి స్టెంట్‌గా పని చేస్తున్న ఆది భాస్కర్ (52)అనారోగ్యంతో మృతి చెందినట్లు ఏపీఓ పార్థసారధి తెలిపారు. రెండు రోజులుగా అనారోగ్యం కారణంగా భాస్కర్ రిమ్స్‌లో చేరారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటలక్షుమ్మ, ఇద్దరు అ మ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలున్నారు. విష యం తెలుసుకున్న ఏపీఓ మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గురువారం ఎంపీడీఓ చేతుల మీ దుగా మట్టి ఖర్చులకు ప్రభుత్వం తరపున రూ. 15వేలు నగదు ఇస్తున్నట్లు ఏపీఓ తెలిపారు.

బీజేపీ విజయోత్సవ సంబరాలు



విజయోత్సవ సంబరాల్లో బీజేపీ నాయకులు

పులివెందుల టౌన్ : కేంద్రంలో మూడవసారి భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ఎన్‌డీఏ కూటమితో పాటు మోదీ మూడవసారి ప్రధానిగా నియమించనున్న సందర్భంగా బుధవారం పులివెందులలో భారతీయ జనతాపార్టీ శ్రేణులు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు, పేదలకు సంక్షేమ ఫలాలు అందించిన మోదీని మరోమారు ప్రజలు ఆశీర్వదించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సాంస్కృతికశాఖ కన్వీనర్ భానుప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, కన్వీనర్ మహేశ్వరరెడ్డి, శ్రీరాములు, నవీన్, రమణారెడ్డి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇది మల్లెల.. మాసం



విక్రయానికి సిద్ధంగా ఉన్న మల్లెపూలు

పులివెందుల రూరల్ : మగువల మనసు దోచుకునే మల్లెలు ప్రస్తుతం మార్కెట్లో గుమాలిస్తున్నాయి. పులివెందుల పట్టణంలో పూల అంగళ్ల దుకాణాల వద్ద దండలు కట్టి రాసులుగా పోసి విక్రయిస్తున్నారు. తోపుడుబండ్లపై ప్రధాన రహదారుల్లో మల్లెలు కనువిందు చేస్తున్నాయి. కదిరి, అనంతపురం, తదితర ప్రాంతాల నుంచి పులివెందుల ప్రాంతానికి మల్లెలు తెచ్చి వ్యాపారులు విక్రయిస్తున్నారు. పూలజడలకు, దండలకు డిమాండ్ పెరిగింది. కిలో మల్లె పూలు నాణ్యతను బట్టి రూ.100ల నుంచి రూ.150ల వరకు విక్రయిస్తున్నారు. తోపుడుబండ్లపై పావు పూలు రూ.10కి ఇస్తుండటంతో మహిళలు వాటిని కొనకుండా ఉండలేకపోతున్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం

వాల్మీకిపురం : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తామని పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఓట్లు వేసిన పీలేరు నియోజకవర్గ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో నియోజకవర్గంలో ఎన్నో సంక్షేమ పథకాలు అందించామన్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీలు కూడా అభివృద్ధిని కొనసాగించాలన్నారు. వేలకోట్ల రూపాయలు డీబీటీ ద్వారా అర్హత కల్గిన పేదలకు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. నియోజకవర్గంలో నాయకుడు, కార్యకర్తలు తమకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామన్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అన్నారు. బుధవారం పర్యావరణ పరిరక్షణ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో భూమి వ్యర్థపదార్థాలతో కలుషితమైందన్నారు. సమతూల్యత దెబ్బతిని వాతావరణం మార్పు చెందుతుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు మొక్కలు నాటితే భావితరాలకు బాసటగా నిలుస్తాయన్నారు. చెట్లు లేకపోవడం వల్ల వర్షాలు పడకపోవడం జరుగుతోందన్నారు. తప్పనిసరిగా ఇంటి ముందర మొక్కలు నాటుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఆహారవిజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అడీన్ డాక్టర్ ఎంఎస్ బేగ్ తెలిపారు. బుధవారం కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ వేగవంతమైన భూమి పునరుద్ధరణ, కరువును తట్టుకునే శక్తి, ఎడారి కరణం నియంత్రణ అనే నేపథ్యం మీద ప్రతి సంవత్సరం పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. స్టూడెంట్ యాక్టివిటీ అధికారి రాజేష్ మాట్లాడుతూ ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు. జాతీయ సేవాపథకం అధికారి డాక్టర్ నివేధిత, అధ్యాపకులు అరుణ, కీర్తిరెడ్డి, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



పులివెందులలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి



వేంపల్లెలో ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది



పులివెందులలో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న ఆహారవిజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

వేంపల్లె : ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వేంపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సునీత పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక క్రిస్టియన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది, పిల్లలతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ ప ర్యావరణం వాయుధ్వని, వ్యర్థపదార్థాలతో మనం నివసిస్తున్న భూమి కలుషితం అవుతోందన్నారు. దీంతో ప్రకృతిలో సమతుల్యత దెబ్బతిని వాతావరణ మార్పులు విపరీతంగా మారటం జరుగుతుందన్నారు. భూమి వేడెక్కడం, వర్షపాతం తగ్గడం, వగడాల్పులు వీచడం, నీటి సరస్సులు, చెరువులు ఎండబారి పోవడం, వీటి పర్యావసానంగా త్రాగేందుకు మంచినీటి కరువు, పంటలు పండక దిగుబడి తగ్గడం ద్వారా కృత్రిమ ఎరువులు వాడకం, దీంతో స్వచ్ఛమైన ఆహార పదార్థం లభ్యం కాకపోవడం తదితర విపరీత పరిణామాలు సృష్టిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు మొక్కలు నాటాలన్నారు.

అలాగే ఇంటి పెరటి నందు కిచెన్ గార్డెన్ పెంచుకోవాలని సూచించారు. భూమి, నీటి కాలుష్యం జరుగకుండా ప్రతి గృహిణి ఇంటి చుట్టూ పరిశుభ్రత పాటించాలని కో రారు. అంతేకాకుండా చిన్నప్పటి నుంచే బాల, బా లికలకు మొక్కల పెంపకం, సంరక్షణ బాధ్యతలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. అందుకు వారిచే మొక్కలు నాటించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వర్ణలత, అంగన్‌వాడీ కార్యకర్త రమ, సహాయకురాలు వెంకటసుబ్బమ్మ, ఏఎన్‌ఎం లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కోరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చర్మవ్యాధుల వైద్య నిపుణులు ప్రతి శుక్రవారం, నెలలో మొదటి ఆదివారం అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రవేశ దరఖాస్తులకు ఆహ్వానం

జమ్మలమడుగు : 2024–25 విద్యాసంవత్సరానికి 6, 9వ తరగతులలో మిగిలిఉన్న ఖాళీలను భర్తీచేయడం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మహాత్మాజ్యోతిరావుపూలే కన్వీనర్ రామకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు, కమలాపురంలలో ఉన్న బాలుర, వనిపెంట, తొండూరు బాలికల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఇంగ్లీషుమీడియం స్టేట్ సిలబస్ బోధించబడుతుంది. స్టేట్ సిలబస్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులనుంచి ప్రవేశానికి దరఖాస్తులు కోరడమైంది. ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలనుంచి ఐదున్నర వరకు నందలూరులోని జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈనెల 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని హాల్ టిక్కెట్లను ఇంటర్నెట్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావాలన్నారు.

డిగ్రీ ప్రవేశానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు

కొత్తగా బీఎస్సీ హానర్స్ బాటనీ కోర్సు

వేంపల్లె : 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రవేశానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ హెల్ప్ డెస్క్ ద్వారా డిగ్రీ ప్రవేశానికి ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ కళాశాల ఏర్పాటైన మూడేళ్ల సందర్భంగా ఐదు కోర్సులకు అదనంగా కొత్తగా బీఎస్సీ హానర్స్ బాటనీ కోర్సును అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని వేంపల్లె పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే బీఏ హిస్టరీ, బికామ్ కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, మాథ్స్, కెమిస్ట్రీ కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 మంది పీహెచ్‌డీ కలిగిన అధ్యాపకుల బృందంతో బోధన జరుగుతుందన్నారు. అలాగే ఎన్‌ఎస్‌ఎస్, స్పోర్ట్సు అండ్ గేమ్స్, రెడ్ రిబ్బన్, క్యాంపస్ డ్రైవ్‌తో పాటు ఆధునిక పద్ధతుల్లో బోధన నిర్వహించబడుతుందన్నారు. కళాశాల నుంచి దాదాపు 150 మంది విద్యార్థులు డిగ్రీ ఉత్తీర్ణులై కడప, బెంగుళూరు నగరాల్లోని ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు పొంది ఉన్నారన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

వేంపల్లె : ఖరీఫ్ సాగు కోసం రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ ఎరువుల దుకాణ యజమానులకు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన వేంపల్లెలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆయన తనిఖీ నిర్వహించారు. అలాగే విత్తనాలకు సంబంధించి స్టాక్ నిలువ రికార్డులు, ధరల పట్టికను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 2024–25 ఖరీఫ్ సీజన్‌లో భాగంగా ఎక్కడా కూడా నకిలీ విత్తనాలు అమ్మరాదని, అలాగే విక్రయ రసీదును రైతులకు ఖచ్చితంగా ఇవ్వాలని ఆదేశించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, దుకాణ యజమానులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్

లింగ వివక్ష విడనాడాలి

కమలాపురం : లింగ వివక్ష విడనాడాలని, భవిష్యత్తు అమ్మాయిలదేనని పెద్దచెప్పలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మహినూర్ తెలిపారు. బుధవారం పీహెచ్‌సీ పరిధిలోని కిషోర బాలికలకు, తల్లులకు లింగ వివక్ష పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో లింగ వివక్ష విడనాడాలన్నారు. లింగ నిర్ధారణ చేయడం నేరమని, చేయించుకున్న వారికి, చేసే వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదన్నారు. అలాగే లింగ నిర్ధారణ చేసే ఆసుపత్రుల అనుమతులు రద్దు చేసి మూసివేస్తామన్నారు. సమాజంలో మహిళలు, పురుషులు సమానం అని, భవిష్యత్తు అంతా అమ్మాయిలదేనన్నారు. ఆడపిల్లలను రక్షిద్దాం.. ఆడపిల్లలను చదివిద్దాం..అని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయకుమారి, షంషాద్, సుబ్బమ్మ, భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు. అలాగే కమలాపురం పట్టణంలోని 7వ వార్డు అంగాన్‌వాడీ కేంద్రంలో 1వ సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీలు నిర్వహించిన సమావేశంలో ఎంఎస్‌కే పద్మజ, ఏఎన్‌ఎం ధనలక్ష్మీలు తల్లులకు లింగ వివక్ష పట్ల అవగాహన కల్పించారు. నేటి ఆడపిల్లే రేపటి అమ్మ అని, ఈ రోజు ఆడపిల్లను వద్దనుకుంటే ఓ తల్లిని, ఓ సోదరిని, ఓ స్నేహితురాలిని, ఓ భార్యను, ఓ బామ్మని కోల్పోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.



కమలాపురంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

హరిహర తనయుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప

రాజంపేట రూరల్ : పట్టణ శివార్లలోని మణికంఠ నగర్‌లో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామి వారికి ప్రతి బుధవారం, సోమవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. ఇందులో భాగంగా బుధవారం శ్రీ అయ్యప్పస్వామి మూల విరాట్‌కు ముందుగా ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజలనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి బుధవారం, సోమవారం భక్తులు తీసుకొచ్చిన పూజా సామగ్రితో స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేయించనున్నట్లు తెలియజేశారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

ఊపిరి ఉన్నంతవరకు ప్రజా సేవలోనే..

రాయచోటి : ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా రాయచోటి అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటనను విలేకరులకు విడుదల చేశారు. 15 సంవత్సరాలుగా నియోజకవర్గ ప్రజలు తనను చాలా గొప్పగా ఆదరించారన్నారు. ఐదేళ్లు మాత్రమే అధికారంలో ఉన్నామని, అందులో రెండేళ్లు కరోనా పరిస్థితులు వచ్చాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రతి ఇంటినీ సందర్శించానన్నారు. కరోనా పరిస్థితుల్లోనూ ప్రజలకు తోడుగా ఉన్నానన్నారు. మూడేళ్లలో తమ ద్వారా చేయగల్గిన అభివృద్ధి చేశామన్నారు. ఐదు సంవత్సరాలు ప్రజల మధ్యలోనే ఉన్నానని పేర్కొన్నారు. ఈ ఎన్నికలలో ప్రజలు దాదాపుగా 90 వేలకుపైగా ఓట్లు వేసి ఆదరించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. స్వల్ప ఓట్లతో ఓటమి చెందానన్నారు. హంగూ ఆర్భాటాలకు ప్రాధాన్యత లేకుండా ప్రతి నిమిషం ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి, శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ప్రజలకు సేవా కార్యక్రమాలు కానీ, ప్రజలకు ఇష్టం వచ్చిన సమయాలలో తోడుగా నిలుస్తానన్నారు. కొంతమంది అభిమానులు నిరుత్సాహపడి బాధపడుతున్న విషయాన్ని తాను అర్థం చేసుకోగలనన్నారు. కానీ మనోధైర్యాన్ని కూడకట్టుకొని మనలను నమ్ముకున్న వారికి తోడుగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పును గౌరవించాలన్నారు. విజయం సాధించిన వారికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నానన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు బుధవారం విజయవాడకు వెళ్తున్నానని, వచ్చిన తరువాత నియోజకవర్గ ప్రజలను, నాయకులను, కార్యకర్తలను కలుస్తానన్నారు. స్వతహాగా తాను వ్యాపారవేత్తను కాదని, కాంట్రాక్టర్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వాడిని అంతకన్నా కాదన్నారు. తనకు తెలిసిందంతా ప్రజా సేవే అన్నారు. తుది శ్వాస వరకు ప్రజాసేవ చేస్తానని, నమ్ముకున్న పార్టీ శ్రేణులకు ప్రతి అడుగులో తోడుంటానన్నారు. గత పదిహేనళ్లలో ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించినప్పుడు పొంగిపోలేదు, ఇప్పుడు స్వల్ప మెజారీతో ఓడినా కృంగిపోనన్నారు. ప్రజల కోసం రాత్రింబవళ్లు పనిచేసే ఆరోగ్యాన్ని, అన్ని కష్టాలను భరించే శక్తిని దేవుడు నాకు ఇచ్చాడన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతానని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

యోగాతో ఆరోగ్యం

అట్లూరు : మన ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే ప్రతిఒక్కరు యోగా చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయ ఆవరణలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా 28 మంది విద్యార్థులకు రామాయణం, యోగా, ధ్యానం నేర్పించడంతో పాటు పుస్తక పఠనం నిర్వహించారు. అనంతరం ప్రతి ఒక్కరూ భారతీయ సంప్రదాయ కట్టుబాట్లకు రామాయణం ఎంతో దోహదపడుతుందని, అలాగే ఆరోగ్యం పదిలంగా ఉండేందుకు చక్కటి యోగా, వ్యాయామం అవసరమని పేర్కొన్నారు. రోజూ యోగా, ధ్యానం చేయడంతో ఉత్సాహంగా ఉంటారన్నారు.

పెరుగుతున్న టమాటా ధరలు



మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

మదనపల్లె సిటీ : టమటా ధరలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. ధరలు పెరుగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లె మార్కెట్‌కు గత రెండు నెలలు నుంచి టమటాలు వస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దిగుబడులు తక్కువ. ధరలు పుంజుకుంటున్న సమయంలో దిగబడులు తగ్గాయి. పెరుగుతున్న ధరలు చూసి రైతులు టమటా సాగుపై మొగ్గు చూపుతున్నారు. మదనపల్లె మార్కెట్‌లో మంగళవారం మొదటి రకం 10 కిలోలు రూ. 660 పలికింది. రెండో రకం 10 కిలోలు రూ.520 పలికింది. 349 మెట్రిక్ టన్నుల కాయలు వచ్చాయి. గత వారం రోజుల నుంచి ధరలు చూస్తే ధరలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. ధరలు ఇంకా పెరుగుతాయని వ్యాపారులు, రైతులు చెబుతున్నారు.

వారం రోజులుగా టమటా ధరల వివరాలు

తేదీ	మొదటి రకం (పది కిలోలు)	రెండో రకం
31.5.2024	రూ.360	రూ.278
1.6.2024	రూ.380	రూ.298
2.6.2024	రూ.440	రూ.320
3.6.2024	రూ. 500	రూ.390
4.6.2024	రూ.660	రూ.520

శివాలయంలో రుద్రాభిషేకం

మదనపల్లె సిటీ : మాస శివరాత్రి సందర్భంగా బుధవారం సాయంత్రం స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి కి రుద్రాభిషేకం చేశారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు.



కన్నుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరుడు



హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వర స్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి ఆలయ ప్రాంగణం కాలక్షేప మండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. కార్యక్రమానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా గురువారం అమావాస్య సందర్భంగా స్వామివారికి ఉజ్జయిని మహాకాళేశ్వరుని వలే పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు భస్మహారతి జరుగనుంది. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ కోరారు.